
# శ్రీవారి పాట్లు

— తమిరిశ జానకి



రోజులాగే, ఈదురోమంటూ ఇంటికి చేరిన రాజారావు, ఎనిమిదో వింత చూస్తున్నట్టు గుడ్లప్పగించాడు గుమ్మంలో నిలబడి చరునవ్వుతో స్వాగతం పలుకుత్ను భార్యని చూసి. ఏదో గత జన్మ జ్ఞాపకంలా ఉంది అతనికి ఈ దృశ్యం... ఔనుమరి..., పిల్లలుపుట్టాక... ఈ ఆరేళ్ళల్లో ఇంతవరకూ ఏరోజూ... సాయంత్రం భార్య ఇలా స్వాగతం పలకడం చూడలేదయ్యే మరి!... అసలే చిరాకూ, విసుగూ ఒకపాలెక్కువే ఉన్న సుమతికి... పిల్లలుపుట్టాక అవి నాలుగింతలయ్యాయి.

ఇద్దరు పిల్లలకే... ఏదో పదిసుంది పిల్లల్ని పెంచుతున్నంత విసుగులూ, చిరాకులూ... ఎప్పుడూ వాళ్ళ మీద కస్సుబుస్సులు... తిప్పితిప్పి ఆ కస్సుబుస్సులు చివరికి తనమీదకి తిరుగుతుంటాయి. ఎప్పుడూ తన ఆఫీసు నించి వొచ్చేటప్పటికి ఏదో ఓకారణాన పిల్లల వీపులమీద వాడ్డిస్తూ, ఆ దరువుల ఊపుకి సమానమైన ఫోర్సులో దండకం చదువుతూ కనపడే భార్య, అందంగాముస్తాబై, అసలు... విసుగూ, చిరాకూ అన్న పదాలకి అర్థమే తెలియనిదానిలా, మొహంలో శాంతం ప్రదర్శిస్తూ, చిరునవ్వుతో కనపడటం... రాజారావు ప్రాణానికి ఎనిమిదో వింతే మరి... కాలం వెనక్కివెళ్ళి, పెళ్ళయిన తొలిరోజులు మళ్ళీ వెనక్కి రాలేదుకదా అనిపించింది ఒక్క క్షణం... కారణం ఏమై ఉంటుందో అంతుపట్టలేదు. భార్య చిరునవ్వుకి బదులుగా చిరునవ్వు నవ్వుతూ (అదీ... భయం భయంగా... కారణం ఏమైఉంటుందా అని బిక్కు బిక్కుమంటున్న మనసు ఫ్రీగా నవ్వనిచ్చి ఛస్తేగా!) లోపలకి అడుగుపెట్టాడు. ముందుగదిలో, ఓ పక్కగా పిల్లలిద్దరూ బొమ్మలూ, ఇన్ని మరమరాలూ ముందుపోసుకుని ఆడుకుంటున్నారు. తండ్రిని చూసి పెద్దపిల్ల లేచి దగ్గరకి రాబోయింది. వెనకే, తమ అక్కని అనుసరించింది చిన్నది. "మంచి పిల్లలు కదూ!... ఆడుకుంటారుట... ఇంకొంచెం మరమరాలూ, సెనగపప్పూ కూడా ఇవ్వనా?" మళ్ళీ వాళ్ళని బొమ్మల ముందు కూలేసింది సుమతి లేవనియ్యకుండా. మరికొంచెం మరమరాలూ, సెనగపప్పూ తెచ్చి వాళ్ళ లక్కపిడతల్లో పోసింది. "మంచిపిల్లలు... మా బంగారం..." అంటూ ఇద్దర్నీ దగ్గరికి తీసుకుని ముద్దెట్టుకుంది.

"పిల్లలమీద ఈ ప్రేమ రోజూ ఎక్కడికిపోతుందో? ఎంతనెమ్మదిగా, ముద్దుగా వాళ్ళని దగ్గరికి తీసుకుంది?"... మొగాడు ముక్కున వేలేసుకుంటే బావుండదనేమో... వేసుకోకుండానే ఓ ఆశ్చర్యపోతున్నాడు రాజారావు. క్షణాల్లో కాఫీ తెచ్చి అందించింది సుమతి. ఇంటికొచ్చాక మెల్లిగా ఎప్పటికోదర్శనమిచ్చే కాఫీగ్లాసు, అంత తొందరగా కంటిముందు నిలిచేసరికి "ఆహా! ఏమి నాభాగ్యమూ..." అని పైకే పాడబోయి ఆగిపోయాడు, పేట పక్కవీధేనని గుర్తొచ్చి. కాఫీ తాగి, స్నానంచేసొచ్చి, పెద్దపిల్లని కేకేస్తూ, మంచమ్మీద దిండుకానుకుని, వెనక్కి చేరబడ్డాడు. కూతురు రాలేదు గానీ, సుమతి వొచ్చింది... చేతిలో ప్లేటు... వేడి వేడి ఇడ్లీలు... కారప్పొడి...

"అరే! టిఫినుచేశావా? చెప్తే వంటింట్లోకే వొచ్చేవాడినిగా?" సరిగ్గా సద్దుకు కూచున్నాడు మంచమ్మీద.

"పర్వాలేదులెండి... ఇక్కడే తినండి." మంచి నీళ్ళ గ్లాసు కిటికీలో పెట్టింది.

"ఏవండీ..." మెల్లిగా నసుగుతూ పక్కన చేరింది.

"ఏమిటి?"



"మరి... మరి... "
"ఊ... మరి? ... "
"మరీ... "
"ఏవిటి మరీ? ... "
"మీరు... మీరు... "
"ఊ... నేనా!... "
"మీరు కథలు రాయాలి... "

"ఆ!... "ఉలిక్కిపడ్డాడు... తుళ్ళిపడ్డాడు... అదిరిపడ్డాడు... వీటిల్లో ఏదన్నా కూడా రాజారావు పరిస్థితికి సరితూగదు, పైగా పొలమారింది. దగ్గాడు...

"కారప్పొడిలో కాస్త కారం ఎక్కువైందనుకుంటాను. ఉండండి. మంచినీళ్ళిస్తాను." చటుక్కున లేచి కిటికీలోంచి గ్లాసందుకుని అందించింది. గడగడా అన్ని నీళ్ళూతాగేసి, గ్లాసు మంచంకింద పెట్టాడు.

"రాస్తారు కదూ!" గోముగా గుండెలమీద రాసింది. పొలమారిందని కాబోలు.

"నువ్వరాస్తున్నావుగా?... "ఆమెచేతివంక చూపించాడు నవ్వుతూ.

"అబ్బ! చెప్పండి! కథలు రాస్తారుగా?" ముద్దుగా విసుక్కుంది.

"వేళాకోళం భలేఆడతావు నువ్వుతల్చుకుంటే..."

"వేళాకోళం కాదూ వెక్కిరంతా కాదూ... మీరు కథలు రాయాలి..."

"నేను?"
"ఊ..."
"కథలు?"
"ఊ..."
"రాయాలి?"
"ఊ... "

"ఏమిటి? కథలు రాయడంఅంటే కూర తరగడం అనుకున్నావా?"

"నాకదంతా తెలియదు. మీరుకథలురాసితీరాలి."

"లేకపోతే?"

"లేకపోతే రోజులతరబడి ఇంట్లో మౌనయుద్ధమే. గుర్తుంచుకోండి."

"అమ్మబాబోయ్! సుమతీ ప్లీజ్... ప్లీజ్... కావాలంటే నువ్వు ఇడ్లీకి నానబోసినప్పుడల్లా నేను రుబ్బిపెడతాను. నువ్వు కష్టపడి రుబ్బనక్కర్లేదు. ఈ ఇడ్లీ మీద ఒట్టు..."

"అక్కర్లేదు. నాకు ఓపిక లేనప్పుడు పప్పు నానపొయ్యనే పొయ్యను. ఇడ్లీలు తిననంత మాత్రాన కొంపలేం మునిగిపోవు."

"మరేంజరిగితే కొంపలుమునుగుతాయిటా?"

"మీరు కథలు రాయకపోతే..."

"అంతమాటనకు. నీకు పుణ్యం ఉంటుంది."

"ఆదేం కుదరదు... రాయవల్సిందే... "

"పట్టుమని పది అక్షరాలు కూడా ఏకథా చదవన్నేను. అటువంటి నన్ను కథలు చదవడమే చేతకాని నన్నుపట్టుకుని కథలురాయమనడం నీకేవన్నా న్యాయమా సుమతీ? ఇంతకంటే ఘోర అన్యాయం ఈ కలియుగంలో ఉందా?"

అసలే పెద్దపెద్ద కళ్ళు సుమతివి... మరింత పెద్దవిగాచేసి చూసింది. మరింత దీనంగా తను చూశాడు... ఆ పెద్దపెద్ద కళ్ళకి, తన కళ్ళల్లో ఉన్న దీనత్వం కనపడి తీరుతుందనుకున్నాడు... లాభం లేకపోయింది. ఖాళీప్లేటు అందుకుని లేచింది సుమతి. చెయ్యి కడుక్కుందుకు తనూ లేచాడు. అసలు, తెలుగులో కథారచనకి నాంది పలికిన ఆ పెద్దమనిషి ఎవరన్న ప్రశ్న బుర్రలో మెదిలింది... తిని కూచోక, తీరి కూచుని కథలూ, కాకరకాయలూ మొదలుపెట్టడం ఎందుకూ ఆ పెద్దమనిషి?..."

* * * *

"ఎప్పుడు మొదలుపెడతారు కథరాయడం?" రాత్రి భోజనం అయ్యాక, పిల్లలు పడుకున్న తర్వాత మళ్ళీ మొదలైంది పాట.

"నాలాంటి వాడిని పట్టుకుని కథలు రాయమనడం, రాస్తేకానీ ఊరుకోననడం... నవ్వాలో ఏడవాలో తెలియట్లేదు నాకు."

"ఏం? ఆ ధనలక్ష్మి వాళ్ళాయనకంటే మీరెందులో తక్కువ? ఆయన చదివిందీ బి.ఏ... మీరు చదివిందీ బి.ఏ.నే... ఆయనచేసేదీ గుమస్తా ఉద్యోగమే... మీరు చేసేదీ గుమస్తా ఉద్యోగమే... ఆయన రాయగాలేనిది మీరెందుకు రాయలేరూ?"

"అయ్యో! సుమతీ!" నెత్తి బాదుకున్నాడు.

"అసలు నీకెందుకొచ్చిందీ పాడు ఆలోచన?"

"పాడు ఆలోచనా? అలాంటి మాటలింకోసారి పొరపాటునకూడా అనకండి."

"మరింకేమనమంటావు నా ప్రాణానికి?" చెయ్యి వేశాడు భార్య భుజమ్మీద.

"గొప్ప ఆలోచనంటాను... ఆ ధనలక్ష్మి ఎంత గొప్పలుపోతోందో మీకేంతెల్సు?" ఆవిడమీద కోపం అంతా భర్త చేతిమీద చూపించింది విసుగుతో.

"నువ్వు గిల్లడంకూడా భలే అందంగా గిల్లుతావు సుమా!" వచ్చేంత మండుతోంది చెయ్యి. అయినా, కథలు రాయమనిఅడిగే ఆ కోరికకంటే ఇలా గిల్లినా భరించడమే తేలిక అనిపించింది.

"మాటమార్చకండి... వాళ్ళాయనేకదా కథలు రాస్తాడని... అబ్బా! ఆ ధనలక్ష్మి... మా అందరి ముందూ ఒకటే పోజులూ... ఒకటే టెక్కులూ... వాళ్ళాయన కథలురాసి సంపాదిస్తున్న డబ్బుతోనే ఇంట్లో అన్నీ కొనుక్కున్నారు... ఇంకా కొనుక్కుంటు న్నారు... అబ్బ! ఒకటేమిటి... అడక్కండి, వాళ్ళింట్లో లేనిది లేదు... పైగా ప్రతి పండక్కీ పట్టుచీర... మీరూ ఉన్నారెందుకూ? పెళ్ళయి ఇన్నాళ్ళయ్యింది. ఒక్కటంటే ఒక్కపట్టుచీరకొన్నపాపాన పోయారా?"

"చూశావా! పట్టుచీర కొనడం పాపం అని నువ్వే ఒప్పుకుంటున్నావు. పట్టుచీర కొనడం ఎందుకూ? పాపాన పోవడం ఎందుకూ?"

"అబ్బ! వేళాకోళంవొద్దు, రాస్తారా లేదా చెప్పండి?"

'సుమతీ! నీచెయ్యి ఖాళీలేదని, నిన్న పొద్దున్న నేను కాకరకాయలు తరిగిచ్చినట్టు అనుకుంటున్నావా కథలు రాయడం అంటే!"


"కాకరకాయలు తరిగిచ్చినట్టో, కమలాఫలాలు వొల్చి ఇచ్చినట్టో... నాకు తెలియదు అదంతా... మీరు రేపట్నుంచే రాయడం మొదలుపెడతారు కథలు... అంతే..."

"నువ్వు డిక్టేట్ చేస్తావుటా?" గడ్డంపుచ్చుకున్నాడు బతిమాలే ధోరణిలో.

"ఇదిగో... ఈ పప్పులేం ఉడకవు. ధనలక్ష్మి వాళ్ళాయనకంటే మీరేం తీసిపోయారని?... "

"పెళ్ళయ్యాక నీ చేతివంటతో బాగానే తీసిపోయాను" నీరసంగా గొణిగాడు, మొహం అమాయకంగా పెట్టి.

"అబ్బ! ఉండండీ... నన్ను పూర్తిగా చెప్పనివ్వరేమిటి?... వాళ్ళాయనకంటే మీరేఅందంగాఉంటారు



కూడా... '' తలొంచుకుని, కళ్ళు వాల్చింది... పెళ్లి మాపులనాటి కాలం గుర్తొచ్చింది కాబోలు...

''అయితే ఓపని చేద్దామా?'' రాజారావు మనసులో ఐడియా.

''ఏమిటి?...'' సుమతి కళ్ళల్లో ఆశ.

''మన పక్కింటాయన నాకంటే అందంగా ఉంటాడుకదా? ఆయన్ని రాసుకోమందామా కథలు!... ''

''రాసుకోమనండి వీపుగోడకేసి... పక్కింటా యన్ని రాసుకోమంటారుట పక్కింటాయన్ని... పాపం! మీరు పర్మిషన్ ఇవ్వలేదని కూచున్నాడాయన కాగితం, కలం ఎదురుగా పెట్టుకుని... హా! ... ఆయన రాస్తే నాకేమొస్తుంది? వాళ్ళావిడకొస్తుందిగానీ!''

అప్పుడే ఆపక్కింటావిడకేదో వొచ్చేసినట్టే, ముక్కూ మూతీ విరిచి మెటికలుకూడా విరవబో యింది గానీ, వెయ్యి నెప్పెట్టి ఊరుకుంది సుమతి.

'ముక్కోటి దేవతల్లో ఏ ఒక్క దేవుడూ తనని రక్షించలేడా' అన్నట్టుగా మొహంపెట్టి కూచున్నాడు రాజారావు.

తను చాకలిపద్దు రాసుకునే రూళ్ళ నోట్‌బుక్ లోంచి నాలుగుకాగితాలు పరపరా చింపింది సుమతి.

పెద్దకూతురు తన శాయశక్తులా రిపేర్‌చేసి, మరింక రిపేర్ చేయడానికందులో ఏమీలేదని పడేసిన ఎర్రరంగు ఇంక్‌పెన్ను తలుపుమూలనించి అందుకుంది.

''ఊ... ఇదుగో... తీసుకోండి... ''

హోమ్‌వర్క్ చెయ్యనని మారంచేసే చిన్నపిల్లాడిలా, తప్పనిసరిగా అందుకున్నాడవి. కాగితాలు అటూ, ఇటూ తిప్పి చూశాడు.

''ఇలాంటి కాగితాలమీద రాసిపంపితే పత్రికల వాళ్ళు వేసుకోరేమో!'' నెత్తిగోక్కున్నాడు.

''అబ్బా! మొదట చిత్తుకాగితాల్లో రాసుకోవా లండీ... ఏమీ తెలియని ఆయోమయం మీరు... మొదటే నేరుగా ఫెయిర్ రాసెయ్యడానికి మీరేవన్నా



కొమ్మూరా? యండమూరా?''

''ఆ మూరలేవిటో నాకు తెలియదు... అయిదు మూరల పంచెలు, ఎనిమిదిమూరల పంచెలు తెలుసు...''

''మాశారా? ఏ పత్రికలూ చదవకపోవడంవలన ఎంతనష్టమో? నేనుచెప్పిన ఆ ఇద్దరూ గొప్ప రచయిత లని ఎప్పటినించో ఊరూ, వాడా కోడైకూస్తున్నా మీ చెవుల్లో ఎందుకుపడలేదు?''

''నేను నిద్రలేచేది ఏడింటికి కదా... కోళ్ళు తెల్లార కట్లే అరిచేస్తాయి మరి... అందుకే నాచెవుల పడుండదు.''

''ఇలాంటి తెలివితేటలకేం తక్కువలేదు... మరింక కథలు రాయాడానికేమొచ్చింది? రాయండి'' ఆర్డర్ వేసేసి తనువెళ్ళి హాయిగా మంచమెక్కింది.

కాగితాలు ముందుకి లాక్కుని, పెన్నుతెరిచి చేతిలో పట్టుకుని కూచున్నాడు. ఎంతసేపైనా ఆలోచనేమి రావట్లేదుగానీ, ఆవలింతలు మటుకు తెగవొచ్చేస్తున్నాయి.

''ఏమిటి? వొస్తోందా ఏవన్నా?'' కళ్ళుమూసుకునే, అటుతిరిగి పడుకునే అడిగింది దర్జాగా, ఆఫీసర్ అమ్మమ్మ మొగుడిలా.

''ఆ... వొస్తోంది నిద్ర'' టక్కున జవాబిచ్చాడు.

గిరుక్కున ఇటుతిరగింది సుమతి. ''మరీ ఎనిమిదింటికే నిద్రపోవడం... చిన్నప్పట్నించే మీ అమ్మచేసిన అలవాటుకి చెప్పకోవాలసలు!... అయినా ఇప్పుడు కొత్తగా నేను తెల్సుకున్నదేముంది? పెళ్ళయిన్నాడే తెల్సిపోయింది మీసంగతి నాకు... ఆ మొదటి రాత్రే. ''

''ప్లీజ్... సుమతి... గదువురేపటికి పొడిగించు... ఇవాళ్టికి నన్నిప్పుడు పడుకోనీ... '' అంటూనే చెయ్యి మూసుకుని ఇంతెత్తు ఎగిరాడు.

''చూడు... నేనొక్క అక్షరంకూడా రాయలేదు. నాచెయ్యంతా సిరాయే... ఇదేం పెన్నూ... ఇలా కక్కిపోస్తోంది...''

''మరేంపర్వాలేదు, నెత్తికిరాసుకోండి.'' ఆవలిస్తూ సలహాపారేసింది

నీళ్ళ గదిలోకెళ్ళి అరగంటసేపు చెయ్యి రుద్దుకొచ్చాడు రాజారావు. ''కథలు రాసి జనంలో కావల్సినంత పేరు సంపాదించుకోబోతున్న, కాబోయే రచయిత, కాస్త సిరాకే అంత చిరాకు పడిపోతే ఎలా?'' ఓ పేద్ద డైలాగు విసిరింది సుమతి.

మాట్లాడితే మళ్ళీ ఎక్కడ కథ రాయమంటుందోనని, నోరుమూసుకుని, మంచమెక్కి ముసుగు తన్నేశాడు.

* * * *

''మీరు కథ రాసేందుకు ఆటంకం లేకుండా, నిద్ర రాకుండా గంటగంటకీ నేను టీ కలిపి ఇస్తాను... తాగుతూ ఆలోచించండి''

రాత్రి ఏడుదాటిందంటేచాలు... రాకరాకఏ ప్రాణస్నేహితుడో వొస్తే కాస్త టీ కలిపి ఇమ్మంటే, వేళాపాళా లేదా కాఫీలకీ, టీలకీ అంటూ తెగ విసుక్కునే తన భార్యేనా ఈ మాట అంటున్నది!... ఆశ్చర్యంగా చూశాడు రాజారావు.

తనెలాగూ రాయనూలేదు... పాడూలేదు... ఈ టీ ఖర్చొకటూ ఎక్స్ట్రాగా?...

నిద్రొచ్చేస్తోంది, తప్పలేదు టీ తాగి చూడ్డం... చదువుకునే రోజుల్లో పరీక్షల్లోనైనా ఎప్పుడూ టీ తాగి కూర్చున్న గుర్తులేదు. ఇదెక్కడి శిక్ష తనకి?...

''విజయం... విజయం సాధించాను... జయం మనదే!''

''ఏవిటండీ బాబూ! ఇంతరాత్రివేళ అలా అరుస్తారు? పిల్లలు లేచి దడుచుకుని ఏడుస్తారు. ఇరుగు పొరుగు ఇంటిమీద పడతారు కూడానూ...''

''సాధించాను. కథ రాసేశాను...'' కాలర్ సవరించు కోబోయాడు. ఒంటిమీదున్నది బనీను.

''ఆ... నిజంగా... రాశారా? నాకు తెల్సు పట్టుపీర తొందర్లోనే • కొంటారు మీరు...'' సంబరంతో, మంచమ్మీంచి దూకినట్టే దిగింది సుమతి. ''ఏది ఇలా ఇవ్వండి''

''చదువుకో...'' అందించాడు విజయగర్వంతో ఉప్పొంగిపోతూ.

పైకే చదివింది... ''ఒక ఊరిలో రంగయ్య, రంగమ్మ అను దంపతులు కలరు. వారికి ఒకరి తర్వాత ఒకరు, ఒకరి తర్వాత ఒకరుగా వరుసగా పదిమంది సంతానము కలిగిరి. ఆదంపతులిద్దరూ అంతమంది పిల్లలతో చాల కష్టములు పడుచుండిరి. వారి ఇంటి పక్కనే లక్ష్మయ్య, లక్ష్మమ్మ అను దంపతులు కలరు. వారికి ముచ్చటగా ముగ్గురు సంతానము కలిగిరి. వారు చాలా సంతోషముగా జీవించుచుండిరి. వారంత ఆనందముగా ఏ బాధలూ లేకుండా ఎలా జీవించుచుండిరో రంగయ్యకు అర్థముకాని ప్రశ్నగా ఉండెను. ఉండబట్టలేక, ఒకరోజు అదే విషయమును రంగయ్యని అడిగి వేసెను. తక్కువ సంతానము ఉండటమే తన సంతోషమునకు మూల కారణమని, నిప్పులాంటి నిజమును రంగయ్య బయట పెట్టెను.''


''అయ్యో రామ!'' దిగాలుపడింది సుమతి కథ చదవడం పూర్తిచేసి.

''బావుంది కదా కథ? ఆటంబాంబులాంటి కథ... మన పత్రికలవాళ్ళు గానీ, మన రేడియోవాళ్ళు గానీ కళ్ళకద్దుకుని తీసుకనే 'థీమ్' ఉన్న కథ, తిరుగులేని కథ... రేడియో ఆన్ చేస్తే ఈ థీమ్ ఉన్న కథలూ, నాటకాలే కదా మోగిపోయేది... నిజంగా ఇదంతా ఆ 'టీ' మహిమే... టీలోనే ఇంత మహిమ ఉంటే ''మందులో'' మరెంత మహత్యం ఉంటుందో కదా... టీనీళ్ళు తాగి, ఇంత గొప్పకథ రాయగలిగానంటే, మందు పుచ్చుకుంటే మరెంత గొప్ప కథ రాయగలనో కదా! మందు పుచ్చుకోడంవల్ల ''మనిషి'' మహామనీషి అవుతాడని దీనివల్ల ఋజువవుతోంది. దానికి నిదర్శనమే, నా ఈ పాళీ వంకరపోయిన కలం నించి వెలువడిన ''నగ్నసత్యం'' లాంటి కథ...''

రెండు చెవులూ గట్టిగా మూసుకుంది సుమతి ''ఆపుతారా మీ ఉపన్యాసం''

''ఉపన్యాసం కాదిది సుమతీ... ఉత్తమ సాహిత్యం...''

''అబ్బా! ఆగండి... ఈ కాగితాల్తో రేపొద్దున్న నేను కుంపటి అంటించుకుంటాను గానీ... రేపు రాత్రి మళ్ళీ ఆలోచించి ఇంకోటేదన్నా మంచి కథ రాద్దురు గాని...






ఇప్పటికి పడుకోండి.''

''ఆ... రేపు రాత్రి కూడా ఈ ప్రసవ వేదన నేను పడాల్సిందేనా?'' జుట్టు పీక్కుందామనుకున్నాడు గానీ, ఇందాక కథ గురించి ఆలోచించినంతసేపూ పీక్కుని ఉండడంవల్ల ఆ మంటే ఇంకా తగ్గక ఊరుకున్నాడు ఇప్పుడు.

''రేపు రాత్రికూడానా అంటారేమిటి? ఇంక రోజూ రాయాలి... ఇవాళ ఈ మాత్రం రాయగలిగారంటే ఇంక దార్లో పడుతున్నట్టే లెక్క మీరు...''

దార్లోనే పడుతున్నానో తల్లకిందులే అవుతున్నానో... నా బాధ నీకేంతెల్సు? గొణక్కున్నాడు నీరసంగా.

''ఏమిటోయ్! రాజారావు... రెండుమూడు రోజులుగా అదోలా ఉంటున్నావు? ఏమొచ్చింది కష్టం?'' అడిగాడు సత్యమూర్తి ఆఫీసులో.

''పెద్ద కష్టమే వొచ్చిపడింది.''

''ఓ... మీ అత్తగారు దిగబడ్డారన్న మాట...''

ఊర్నుంచి ఎప్పుడైనా అత్తగారు వొచ్చిందంటే, తిరిగి ఆవిడ వెళ్ళేదాకా తనపాలిటి యమగండంలా ఉంటుందని... ఉన్నన్ని రోజులూ ఇంట్లో ప్రతి విషయంలోనూ ఆఖరికి అల్లుడికి సంబంధించిన విషయాలన్నిట్లో కూడా ఆవిడ ఇష్టం, ఆవిడ అధికారం చలాయిస్తుం దని, ప్రాణస్నేహితుడు సత్యమూర్తితో చాలాసార్లే చెప్పుకున్నాడు రాజారావు.

''ఉహూ... మా అత్తగారు దిగబడలేదు.''

''అంతకంటే పెద్ద కష్టం నీకేముంటుంది?''

''వొచ్చిపడింది మీద. కథలు రాయమని మా ఆవిడ నన్ను కల్వంలో మందులా నూరేస్తోంది...''

* * * *

పకపకా నవ్వాడు సత్యమూర్తి. ''బావుంది... ఇంకనేం... రాసేసి పత్రికలవాళ్ళనీ, పాఠకుల్నీ అదరగొట్టేసెయ్యి, కలంపేరుతో రాస్తావా? అసలు పేరుతోనే రాస్తావా?''

''అసలే నా బాధలో నేనుంటే... నీ హాస్యాలేమిటి మధ్యన?'' ఆఫీసునించి ఇంటికెళ్ళే టైము దగ్గిర పడుతున్నకొద్దీ గుండెల్లో గుబులు ఎక్కువవుతోంది రాజారావుకి.

* * * *

''ఏమండీ...''

''ఆ. ఏమిటీ?...''

''ఇందాక మీ స్నేహితుడు సత్యమూర్తిగారొచ్చి...''

''ఆ వొచ్చి?...''

''వొచ్చి... మీమీద ఏవేవో లేనిపోని మాటలు చెప్పి వెళ్ళారండీ...''

''ఏంచెప్పాడేమిటీ?'' బట్టలు మార్చుకుంటూ అడిగాడు రాజారావు.

''నేను నమ్మనులెండి ఆమాటలు... వాళ్ళూ, వీళ్ళూ చెప్పే మాటలు నమ్మి కాపరం పాడు చేసుకుంటానా?

''అసలేంచెప్పాడూ?''

''మీరీమధ్య రోజూ ఆఫీసునించి లేటుగా రావడానిక్కారణం... మీ ఆఫీసులో పనిచేసే శోభారాణి ఇంటికి రోజూ వెళ్ళి గంటలగ్గంటలు గడుపుతున్నారుట మీరు...''

''ఓ... అదా... ఔను సుమతీ... అందులో లేనిపోని మాటలేం ఉన్నాయి. ఉన్నమాటే వాడు చెప్పాడు.''

''ఆ...'' షాక్ కొట్టినట్టయింది సుమతికి ఆ జవాబుతో.

''తను రాసిన నలభై అయిదు కథలూ తిరుగుటపాలో తిరిగొచ్చిన ఎక్స్‌పీరియన్స్ ఉంది ఆ శోభారాణికి... పట్టు వదలని విక్రమార్కుడిలా ఇంకా రాస్తూనే ఉందావిడ... అందుకని అటువంటి ఎక్స్‌పీరియన్స్ గలవాళ్లతో రోజూ చర్చలు సాగిస్తే కథలు రాయడం వొస్తుందినాకని... నీ కోరిక తీర్చడం కుదురుతుందని... రోజూ వాళ్ళింట్లో కొంతటైము గడుపుతున్నా న్నేను...'' చాలా తేలిగ్గా చెప్పాడు రాజారావు.

''పెళ్ళయిందా ఆవిడకి?'' ఉండబట్టలేక అడిగేసింది.

''లేదు...''

''ఎవరెవరుంటారు వాళ్ళింట్లో?''

''ఆవిడొక్కత్తే... ఎవ్వరూ లేరావిడకి... ఆవిడ నడం ఎందుకులే అమ్మాయినచ్చు... చాలా బావుంటుందికూడా... అసలైనా... అంత అందమైన ఆమె రాసే కథలు... పత్రికలవాళ్ళు ఎందుకు వేసుకోవట్లేదో నాకర్థం కావట్లేదు...''

భర్త మాటలు వింటుంటే ఒంటికి కారం రాసినట్టనిపిస్తోంది సుమతికి... ఆ శోభారాణి అందాన్ని అతను పొగుడుతుంటే మరి అక్కడ నిలబడలేక ఏదో పని ఉన్నట్టు వంటింట్లోకి నడిచింది.

''ఇప్పుడు నేనొస్తున్నది కూడా ఆ శోభారాణి ఇంటినించే...'' వెనకనించి కాస్త గట్టిగా అరిచాడు రాజారావు.

* * * *

''ఎంతవరకూ వొచ్చింది మీ కథా ప్రయత్నం?''

''అబ్బో! అంత తేలికనుకుంటున్నావేమిటి? చర్చించుకుంటున్నాంగా రోజూ ఇద్దరం... జీడి పాకంలా సాగీ, సాగీ చివరికెప్పుడో తేల్తాయి కథలు... ఓపికపట్టు మరి... అన్నట్టు నేనీపూట భోజనం చెయ్యను. నువ్వు తినేసెయ్యి... ఆ శోభారాణి పెసరట్లు వేసి పెట్టింది... ఎంత బావున్నాయో! ఎన్ని తిన్నానో... ఎన్ని తినిపించిందో నాకే తెలియదు. అలా తినేశాను... చాలా హెవీగా ఉంది... నువ్వన్నం తినేయ్యి... పాపం నాకోసం కూచున్నావు... తొమ్మిదిన్నరైపోయింది...''

''మీ నరసేం బాగులేదు. రోజురోజూ వాళ్ళింట్లో ఇది తిన్నాను, అది తిన్నాను... హెవీగా ఉంది... అన్నం తినను అంటూ...''

''మరేం చెయ్యమన్నావు చెప్పు... తనంత ప్రేమగా తినమని బతిమాలుతుంటే... కాదని ఎలా అనగలను?''

సుమతి గుండెల్లో రాయిపడింది... అయింది... ఎన్ని కథల్లో చదవట్లేదూ ఇలాంటి వ్యవహారాలు... ఇంక తన కాపరం కూలడానికి అట్టే దూరం లేదేమో!... కథలు రాయమని పీక్కుతిని, తన చేజేతులా చేసుకున్నదేగా ఇది!... హారి భగవంతుడా! ఎలాంటి సమస్య తెచ్చిపెట్టావయ్యా బాబూ!...

ఆ రాత్రంతా కలత నిద్రే సుమతికి. ఏవేవో పీడకలలు... ఆ శోభారాణి ఎవరో ముక్కూ మొహం తెలియదు. అయినా కల్లోకొచ్చింది... కల్లోఉన్న ఆ కాసేపూ పదిహేను పట్టు చీరలైనా మార్చింది... ఒక్క కథకూడా ఆవిడది అచ్చు అవలేదన్నాడే తన భర్త... మరి, అన్ని పట్టుచీరలెలా వొచ్చాయో ఆవిడకి... అర్థం

కాలేదు సుమతికి. తన ఎదురుగానే, తన భర్త ఆవిడ చెయ్యి పుచ్చుకుని అలా అలా ఎక్కడికో, సినిమాలో ఆఖరిసీన్లో వెళ్ళిపోతున్నాడు... ఏడుపాగలేదు సుమతికి... ఈ కథలు రాయమనడం నా కొంపే ముంచింది కదా! ఇంతలో మెలుకువొచ్చేసింది... చూస్తే, పక్కన గాఢనిద్రలో ఉన్నాడు భర్త...

* * * *

"ఏవండీ!" పొద్దున్న నిద్ర లేస్తూనే పిలిచింది సుమతి.

"ఊ..."

"ఇవాళ సాయంత్రం తొందరగా వొస్తారా ఇంటికి?"

"ఎందుకూ?"

"ఇవాళ మన పెళ్ళిరోజా?"

అలాగా, కానీ తొందరగా రావడం కుదరదు సుమతీ... ఇవాళే నేనూ, శోభారాణీ చాలా సీరియస్‌గా డిస్కస్ చెయ్యదల్చుకున్నాం నేను రాయబోయే కథ గురించి."

తనకొచ్చిన కలగుర్తొచ్చి భయం వేసింది సుమతికి.

"మొన్నటికి మొన్నా... చిన్నదాని పుట్టినరోజునాడు త్వరగా ఇంటికి రమ్మంటే ఆ రోజూ ఇలాగే అన్నారు.. అంతకుముందూ ఓ రోజు గుడికి వెళ్దామంటే ఇలాగే అన్నారు... సినిమా కెళ్దామన్న రోజూ ఇలాగే అన్నారు..."

"ఏంచెయ్యమన్నావు చెప్పు... నీ ముచ్చట తీర్చడం. కోసమే కదా నా ఈ పాట్లన్నీ... కథలు రాసే ప్రయత్నం నీకోసమే కదా?"

"కథలు రాసే ప్రయత్నంలోనే ఉన్నారో... కథ నడిపించే ప్రయత్నంలోనే ఉన్నారో ఆ దేవుడికి తెల్సు..."

"దేవుడిదాకా ఎందుకూ? శోభారాణికి తెల్సు నేనే ప్రయత్నంలో ఉన్నానో..."

ఒళ్ళు మండిపోయింది సుమతికి. కూర్చున్నది కాస్తా చటుక్కున లేచి నిలబడింది. "చూడండీ... మీరివాళ సాయంత్రం తొందరగా ఇంటికి వొచ్చి తీరాలి."

"మరి... మాటిచ్చానే శోభారాణికి..."

కళ్ళనీళ్ళొక్కటే తక్కువయ్యాయి సుమతికి.

"ఇదుగో... ఇప్పుడు చెప్తున్నాను వినండి... ఇవాళ నించీ మీరు ఆఫీసునించి తిన్నగా ఇంటికొచ్చెయ్యాల్సిందే... శోభారాణి లేదు సుధారాణి లేదు..."

"అరే... మరి... అలా అంటే ఎలా?... నీ ముచ్చట తీర్చడం ఎలా? ఇన్నాళ్ళుగా ఆ శోభా రాణితో డిస్కస్ చేస్తూ ఉండడంవల్ల ఇప్పటికి కొంచెం దార్లో పడుతున్నాన్నేను... కథ రాయగలనన్న ధైర్యం వొస్తోంది..."

ఆవేశం పొంగుకొచ్చింది సుమతికి "మీరు కథలూ రాయక్కర్లేదు. కవితలూ రాయక్కర్లేదు..."

"నిజం? నిజంగానా?" ఒక్క ఉదుటున సంబరంగా లేచి భార్య భుజాలమీద చేతులు వేశాడు.

"నిజంగానా సుమతీ? నిజంగానే నేను కథలు రాయక్కర్లేదా? ఇంక మళ్ళీ ఎప్పుడూ రాయమని అడగవా?"

"ఎప్పుడూ అడగను..." నిక్కచ్చిగా చెప్పింది.

"మరి?... మరి... నీకు పట్టుచీరలు..." అనుమానంగా చూసాడు.

"పట్టుచీరలు నాకేం అక్కర్లేదు..."

"మరి... ఇంట్లో... నీకొకావల్సినవన్నీ కొనుక్కోడం?... టి.వి., ఫ్రిజ్..."

"నాకవేం అక్కర్లేదు... మీరు నాతో ఉంటే చాలు... మీరు ఉద్యోగంలో పైమెట్టుకి వెళ్ళి, మీ జీతం పెరిగి, జీతండబ్బుల్లో మిగుల్చుకుని ముందుముందు ఎప్పుడైనా కొనుక్కోగలిగితే కొనుక్కుంటాం... లేకపోతే లేదు... మీరునాతో ఉంటే అంతేచాలు నాకు..." భర్తగుండెలమీద వాలిపోయింది.

"బలవంతంగా మీ చేత కథలు రాయిద్దామనుకోడం నా తప్పే... అందుకు నన్ను క్షమించండి..."

హాయిగా గాలిపీల్చుకున్నాడు రాజారావు. "సత్యమూర్తికి థాంక్స్ చెప్పుకోవాలి..."

"ఎందుకూ?" ఆశ్చర్యపోయింది.

"ఈ శోభారాణి నాటకం ఆడించినందుకు... ఐడియా చెప్పినందుకు..."

"అంటే?... శోభారాణి?"

"మా ఆఫీసులో అసలు శోభారాణి లేదు... ఏరాణీ లేదు... నేను రోజూ సత్యమూర్తి ఇంట్లోనే పొద్దుపోయేదాకా గడుపుతూ ఉండేవాడిని. ఈ కథలు రాసే గండంనించి పూర్తిగా తప్పించుకుందుకు సత్యమూర్తి చెప్పిన ప్లానులో కల్పించిన పాత్ర ఆ శోబారాణి." తెల్లమొహం వేసింది సుమతి. "ఎంత నాటకం ఆడారు? రూపం అంటూ లేని ఆ శోభారాణి నాకలల్లోకి కూడా వొచ్చి ఏడిపించేసింది నన్ను... ఆ... అన్నట్టు నాకొక ఐడియా వొస్తోందండీ..." సుమతి బుర్రలో మెరుపులా మెరిసింది ఆలోచన.

"ఏవిటి?"

"మీచేత కథలు రాయించాలన్న నా ముచ్చట, మీరు పడినపాట్లు, ఈ శోభారాణి నాటకం మధ్యలో... ఇవన్నీ కలిపి చక్కగా అల్లేసి ఓ కథ రాసేయచ్చేమో మీరు!..."

"అయ్యబాబోయ్! మళ్ళీ కథమాట ఎత్తావంటే ఈసారి ఏ ఉషారాణినో వెతుక్కోవల్సి వొస్తుంది..." మరి ఒక్క క్షణం అక్కడ నిలబడకుండా, పేస్టూ బ్రష్షూ పుచ్చుకుని బాత్‌రూమ్‌లోకి పరిగెత్తాడు రాజారావు.



కాలమ్ దాటని కథ

వంటావిడ గంటమ్మగారి వంట అమృతమే గానీ... ఆవిడకి అలవాటుగా చెయ్యివాటం మాత్రం ఎక్కువగా వుందని గ్రహించింది మైత్రేయి. పప్పులు, ఉప్పులు... కూరలు నారలే కాక చెంచాలు... చిన్న చిన్న కంచాలు కూడా తెరచాటుగా గంటమ్మగారి ఇంటికి తరలి వెళ్ళిపోవడం గమనించి కుళ్ళి కుళ్ళి తనలో తానే కుమిలిపోయింది మైత్రేయి.

జాకెట్లో పెట్టుకుని తీసుకెడుతుందో... బొట్లో దోపుకుని దాటేస్తుందో... అర్థం కాలేదు మైత్రేయికి. బాగుండదని భర్తకి చెప్పుకోలేదు. అట్లా అని తన

## పోపు మాడిపోయింది!

మనసుకి నచ్చచెప్పుకోలేకపోయింది. దీనికేదో విరుగుడు తనే కనిపెట్టాలని ఆలోచించి... తల తిరిగేలా ఆలోచించి... మంచం మీద ఒరిగి హాయిగా నిద్రపోయింది.

ఒక రోజు గంటమ్మగారు వంట చేసి మధ్యాహ్నం ఇంటికెళ్ళిన తరువాత గంటకల్లా ఆమె ఇంటి ముందు ఆటోలో నీటుగా దిగింది మైత్రేయి. విస్తుపోయిన గంటమ్మగారు సుస్తీ వచ్చినదానిలా అయిపోయి... క్షణాల్లో తేరుకుని... "రండమ్మగారూ" అంటూ నిండుగా ఆహ్వానించింది.

"దీని దుంపు తెగ... పనిమనిషి తంపులమ్మ... నిలువునా మీ కొంప ముంచింది గంటమ్మగారూ! మా ఇంట్లోంచి తను దొంగిలించిన నాలుగు చెంచాలు... మూడు కంచాలు... రెండు గిన్నెలు... నాలుగు పాయసం దొన్నెలూ... వగైరాలన్నీ మీ ఇంట్లో దాచిపెట్టానని చెప్పింది. మావారు గబుక్కున పోలీసులకు ఫోన్ చేసేశారు. ఇంకో గంటలో అంటే మీరు మా ఇంటికి వంట చెయ్యడానికి వచ్చేలోపుగా... మిమ్మల్ని పోలీసులు తీసుకెళ్ళి... కాళ్ళు చేతులూ విరగగొట్టేసి... కీళ్ళు ఊడదీసి... కారం మీ ముఖానికి అలంకారంగా పూసి... ఇంకా ఏమేమో చెప్పరాని తప్పుడు పనులన్నీ చేస్తారట. అయినా మీకేం భయం? నేను మెచ్చిన మచ్చలేని వంట మనిషి మీరు... నిశ్చింతగా వుండండి వస్తాను" అంది మైత్రేయి.

గడగడ వణికిపోయిన గంటమ్మగారి ముఖం మాడిపోగా వెంటనే వంటింట్లోకి వెళ్ళి ఆ వస్తువుల్ని తెచ్చి ఇచ్చేసింది.

విజయగర్వంతో నవ్వుకున్న మైత్రేయి ఆత్రంగా వాటి నందుకొని ఆటోలో బయలుదేరింది.

ఆ తర్వాత గంటమ్మగారు మైత్రేయి ఇంటికి వచ్చి వంట చెయ్యలేదు పాపం.

—వడ్లమన్నాటి కుటుంబరావు